ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 13 ఆగస్టు 2024



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల :9985411608
తాడిపత్రి, : 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ, : 9985411657,
కళ్యాణదుర్గం, :9701120019,
రాయదుర్గం, : 9000406723,
ఏసీఎమ్: 9985411154

స్వాతంత్ర్య వేడుకల రిహార్సల్స్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ





స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లకు సూచనలు ఇస్తున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, ఆగస్టు 12: పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ మురళీ కృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ వేడుకలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు ఉండకుండా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కలెక్టర్ ప్రత్యేక వాహనంలో నిలబడి పరేడ్ రిహార్సల్ చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. వేడుకలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 12: డీఎస్సీకి ఉచిత శిక్షణ కోసం ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యార్థులు మంగళవారంలోగా దరఖాస్తుల ను అందజేయాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధి కారి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్టీ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, టెట్‌లో మా ర్కులు, వయస్సు, మెరిట్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురంలోని పెన్నార్‌భవన్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రాయచూరు ప్యాసింజరు రద్దు

గుంతకల్లు, ఆగస్టు 12: ప్రయాణికుల ఆక్యుపెన్సీ లేని కారణంగా గుంతకల్లు-రాయచూరు-గుంతకల్లు (నంబరు 07729/30) ప్రత్యేక రైలును రద్దు చేశామని రైల్వే అధికారులు సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును ఐదు రోజుల కిందట గత బుధవారం ప్రారంభించారు. కానీ ప్రయాణికుల ఆదరణ లేని కారణంగా ఈ రైలును మంగళవారం నుంచి రద్దు పరచినట్లు తెలియజేశారు.

- సక్రమంగా పనిచేయని సర్వర్
- అప్‌లోడ్ కాని పంట వివరాలు, ఫొటో
- రీ సర్వే గ్రామాల్లో పంట నమోదుకు ఇక్కట్లు
- తలలు పట్టుకుంటున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

జిల్లాలో ఈ పంట నమోదుకు సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈనెల 3 నుంచి ఖరీఫ్‌లో సాగైన పంటల నమోదు ప్రక్రియ మొదలైంది. తొలి రోజు సర్వర్ పని చేసినా ఆ మరుసటి రోజు నుంచి సక్రమంగా పనిచేయడం లేదు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు పంట నష్టపరిహారం, పంటల బీమా, ఇతర రకాల పథకాలు వర్తింపజేస్తున్నారు. ఇంతటి ముఖ్యమైన ఈ పంట నమోదు ప్రక్రియ సర్వర్ సమస్య, పలు సాంకేతిక సమస్యలతో ముందుకు సాగడం లేదు. రైతులు పలు మార్లు తమ పంట పొలంలో ఫొటో దిగేందుకు వెళ్లినా సర్వర్ పని చేయక పోవడంతో నిరాశతో వెనుతిరగాల్సివస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచని అయోమయంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది తలలు పట్టుకుంటు న్నారు. - అనంతపురం అర్బన్



ఈ-పంట నమోదు చేస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

అన్నీ కష్టాలే!

ఈ-పంట నమోదులో ఇబ్బందులు




సక్రమంగా పనిచేయని సర్వర్

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రకం ఈ పంట నమోదు యాప్‌ను ప్రవేశపెట్టారు. గతంతో పోలిస్తే యాప్‌లో పంట వివరాల నమోదు సులభంగా చేసేలా రూపొందించారు. కొత్త యాప్‌లో యూఐ (యూజర్ ఇంటర్ ఫేస్) బాగుందని సిబ్బంది చెబుతున్నారు. అయితే సర్వర్ సమస్యతో ఈ పంట నమోదు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నెలారంభంలో తొలుత 2.4 వర్షన్ యాప్‌ను ఇచ్చారు. పైలెట్ ప్రాజెక్టుతోపాటు క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదుకు వెళ్లిన సమయంలో కొత్త యాప్‌లో పలు రకాల సాంకేతిక సమస్యలు రావడంతో 2.5 వర్షన్‌కు యాప్‌ను అప్‌డేట్ చేశారు. వర్షన్ అప్‌డేట్ చేసినా సర్వర్ సమస్య పరిష్కారం కాలేదు. గత వారం రోజులుగా ప్రతి రోజూ గంటల తరబడి సర్వర్ మొరాయిస్తుండటంతో రైతు సేవా కేంద్రం సిబ్బంది సతమతమవుతున్నారు. పలు మార్లు రైతులను పొలాల వద్దకు తీసుకువెళ్లి పంట వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేసినా ప్రయోజనం దక్కడం లేదు.

అప్‌లోడ్ కాని పంట వివరాలు

రైతు సేవా కేంద్రం సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లే ముందు సర్వే నెంబర్ ఆధారంగా జియో కోఆర్డినేట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ముందస్తు షెడ్యూల్‌ను తయారు చేసుకొని ఏఏ తేదీల్లో గ్రామాల్లోని ఏఏ సర్వే నెంబర్లల్లో ఈ పంట నమోదు చేస్తున్నామన్న వివరాలు రైతులకు దండోరా వేసి తెలపాల్సి ఉంది. షెడ్యూ ల్ మేరకే క్షేత్ర స్థాయి కి వెళ్లి ఈ పంట నమోదు చేయాలి. ఇందులో భాగంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది ఒక గ్రామంలోని కొన్ని సర్వే నెంబర్లను జియో కోఆర్డినేట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని ఈ పంట నమోదుకు వెళుతున్నారు. ఆయా రైతులను వారి పంట పొలాల వద్దకు తీసుకొని వెళ్లి పొలంలో నిలబెట్టి ఫొటో తీస్తున్నారు. ఆ తర్వాత ఈ పంట యాప్‌లో పంట వివరాలు, రైతు ఫోటోను అప్‌లోడ్ చేయగా ఫొటో ఎగ్జంషన్ అని చూపిస్తూ వివరాలు సర్వర్‌కు అప్‌లోడ్ కావడం లేదు. దీంతో రైతు సేవా కేంద్రం సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆయా రైతులను తిరిగి పొలాల వద్దకు తీసుకువెళ్లి పలు మార్లు ఫొటో తీసి అప్‌లోడ్ చేసినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. యాప్‌లో సర్వే నెంబర్ల వారిగా సాగు చేసిన పంట వివరాలు, ఫొటో అప్‌లోడ్ అయితేనే ఈ పంట నమోదు పూర్తవుతుంది. అయితే బుక్ చేసిన వివరాలు అప్‌లోడ్ కాకపోవడంతో ఏం చేయాలో తోచని సందిగ్ధంలో సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సమస్యను రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి దాకా పరిష్కరించలేదన్న విమర్శలున్నాయి.



← ఈ-పంట యాప్‌లో పంట వివరాలు, ఫొటో అప్‌లోడ్ కాని దృశ్యం

రీ సర్వే గ్రామాల్లో అయోమయం

జిల్లా వ్యాప్తంగా 198 గ్రామాల్లో భూముల రీ సర్వే జరిగింది. ఆయా గ్రామాల్లో సర్వే నెంబర్లకు బదులుగా సర్వే ల్యాండ్ పార్సల్(ఎల్‌పీ) నెంబర్లను నమోదు చేశారు. రీ సర్వే సమయంలో పలు రకాల అభ్యంతరాలు తెలిపిన భూములకు వివాదాల్లో ఉన్నట్లుగా చూపుతూ జేఎల్‌పీ నెంబర్లను నమోదు చేసినట్లు సమాచారం. ఆ వివరాలన్నీ స్థానిక వీఆర్వో లాగిన్‌లో ఉన్నట్లు తెలిసింది. రీ సర్వే గ్రామాల్లో ఈ పంట నమోదు చేసే సమయంలో స్థానిక వీఆర్వో, సర్వేయర్ సహకరించాల్సి ఉంది. అలాంటి ప్రాంతాల్లో వీఆర్వోలు సరిగా స్పందించకపోవడంతో ఈ పంట నమోదు చేయడం ఇబ్బందిగా మారినట్లు సమాచారం.

6వేల హెక్టార్లల్లో ఈ-పంట నమోదు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. ఇప్పటి దాకా 1.43 లక్షల హెక్టార్లల్లోనే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 53వేల హెక్టార్లు, కంది 40వేలు, పత్తి 21వేలు, ఆముదం 12వేలు, మొక్కజొన్న 7580, సజ్జ 2149, కొర్ర 2645 హెక్టార్లల్లో సాగయ్యాయి. మిగతా విస్తీర్ణంలో జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్, పెసలు, మినుములు, తదితర రకాల పంటలు సాగయ్యాయి. యాప్‌లో సర్వర్ సమస్యతో ఈ పంట నమోదు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు. ఇప్పటి దాకా కేవలం 6వేల హెక్టార్లల్లో ఈ పంట నమోదు పూర్తయ్యింది. సెప్టెంబరు 15లోగా ఈ పంట నమోదు పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్వర్ సమస్యతోపాటు యాప్‌లో పంట వివరాలు, ఫొటో అప్‌లోడ్ సమస్యను పరిష్కరించకపోతే గడువులోగా ఈ పంట నమోదు పూర్తి కావడం కష్టమనే వాదనలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



ఈ పంట యాప్‌లో సర్వర్ సమస్యలు తలెత్తుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. యాప్‌లో కొన్ని చేర్పులు, మార్పులు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేం దుకు చర్యలు చేపడుతున్నారు. త్వరలోనే అన్ని రకాల సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను గడువులోగా ఈ పంట నమోదు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఆలయంలో విగ్రహం ధ్వంసం





← ధ్వంసమైన నంది విగ్రహం, పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 12: మండలంలోని చదం గ్రామంలోని లింగాలబండ పశుపతినాథుడి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు నంది విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం పూజారి జడెప్ప దేవాలయం వద్దకు వెళ్లగా అప్పటికే తాళాలు పగులగొట్టారు. లోపల మరో తలుపు వెల్డింగ్‌తో బద్దలు కొట్టారు. దేవాలయానికి అమర్చిన ఇనుప వాకిలిని కట్టర్‌తో తొలగించారు. గుడిల పడమర వైపు ఉన్న నంది విగ్రహం కొంత పగులగొట్టారు. మూల విరాట్‌కు నల్లవస్త్రాలను కట్టి ఉమ్మెత్తికాయలు, అరటిపండ్లు, అరటి ఆకులు, పండ్లను పెట్టి క్షుద్రపూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనిపించాయి. దీనిపై పూజారి వెంటనే గ్రామప్రజలకు సమాచారం అందించి పోలీసులకు విషయాన్ని తెలిపారు. సీఐ శ్రీనివాసులు క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- పశుపతినాథుని ఆలయాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సందర్శించి ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం పూజారితో మాట్లాడి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గుప్త నిధుల కోసం పురాతన ఆలయాలను ధ్వంసం చేస్తున్న ముఠాలను గుర్తించేందుకు ఎస్పీతో చర్చించానన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.

ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోండి..!

గ్రీవెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, ఆగస్టు 12: ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత వరకూ మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలోనే పరిష్కారం కావాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ప్రజల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్, డీఆర్వో రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతులు స్వీకరించారు. మొత్తం 410 మంది అర్జీలు అందించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మసముద్రం, గుత్తి, వజ్రకరూరు, ఉరవకొండ మండలాలు ఇళ్ల నిర్మాణంలో చాలా వెనుకబడి ఉన్నాయని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

- అనంతపురం రూరల్ మండలంలోని చంద్రబాబు కాలనీకి చెందిన దివ్యాంగురాలు రుక్సానా పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చారు. మంచానికి పరిమితమైన తనకు పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు.
- 108 అంబులెన్సులలో పనిచేస్తున్న తమను ఉద్యోగాల నుంచి తొలగించేందుకు పర్యవేక్షణ అధికారులు కుట్ర చేస్తున్నారని పలువురు ఈఎంటీలుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విడపనకల్లు ఈఎంటీ సుంకన్న, వజ్రకరూరు ఈఎంటీ జయక్రిష్ణ కలెక్టరును కలిశారు. తాము ఎలాంటి తప్పులు చేయకపోయినా టార్గెట్ చేస్తున్నారని, రూ.60 వేలు లంచం అడిగారని ఫిర్యాదు చేశారు. విచారించి బాధితులకు న్యాయం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవిని కలెక్టర్ ఆదేశించారు.
- అధికారులు ఇన్‌చార్జిలు అయినంత మాత్రాన ఫైల్స్ క్లియరెన్స్ పట్ల నిర్లక్ష్యం కుదరదని కలెక్టర్ హెచ్చరించారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ సమస్యలపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ వసంతబాబు తాను ఇన్‌చార్జిని అంటూ.. పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో ఇన్‌చార్జి పేరిట తప్పించుకోవడం కుదరదని కలెక్టర్ హెచ్చరించారు. ఫైల్స్ చూసి పరిష్కరించకుండా పెండింగ్ పెడితే ఎలా అని ఆర్డీఓను కలెక్టర్ ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ఫైల్స్ క్లియర్ చేయాలని, ఇంకోసారి ఎక్కడా ఇన్‌చార్జి అనే మాట వినబడకూడదని అన్నారు.
- గురుకుల విద్యాలయాల అధికారులకు కలెక్టర్ క్లాస్ తీసుకున్నారు. 'సీట్లు ఖాళీగా ఉన్నాయా..? అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినట్లు మీరు అనుకుంటే సరిపోతుందా..? సీట్లు లేవని, ఎవరినో నమ్మి మోసపోవద్దని పత్రికా ప్రకటన ఇవ్వండి. ప్రభుత్వం అదనపు సీట్లు కేటాయిస్తే.. అప్పుడు కూడా మెరిట్, రిజర్వేషన్ ప్రకారమే తీసుకుంటామని స్పష్టం చేయండి' అని ఆదేశించారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

ఆరోగ్యం కోసం ఆల్బెండజోల్ : కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 12: చిన్నారుల ఆరోగ్యం కోసం నులిపురుగులను నివారించాలని వైద్యాధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న డీవార్మింగ్ చేపడుతున్నామని తెలిపారు. చిన్నారులు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉంటే రక్తహీనత, ఇతర వ్యాధులబారిన పడతారని అన్నారు. వాటి నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని అన్నారు. జిల్లాలో 6,08,529 మంది చిన్నారులు, కిశోర బాలలు ఉన్నారని, వారందరికీ మాత్రలు ఇవ్వాలని కలెక్టరు ఆదేశించారు.

ఏం చేశారో ఏమో!

కేంద్రం నిధులు 'దారి' మళ్లాయా?

- గ్రామీణ రోడ్లను పట్టించుకోని వైసీపీ సర్కార్
- నేటికీ పెండింగ్‌లో 56 శాతం పనులు



గార్లదిన్నె మండలం మర్తాడు నుంచి కోటంకకు వెళ్లే రహదారి ఇలా..

అనంతపురం సిటీ, ఆగస్టు 12: కేంద్రం నిధులిచ్చినా గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధి పట్టించుకోలేదు. దీంతో రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. గత ఐదేళ్లలో కనీసం 50 శాతం పనులు కూడా చేయలేదు. మంజూరైన వాటిలో కూడా 56శాతం పనులు ఇప్పటికీ ప్రారంభంకాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ విషయం బయటపడింది. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందా? లేక పథకాల పేరుతో వైసీపీ నాయకులు స్వాహా చేశారా అన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ఈ విషయాలను నూతన ప్రభుత్వం నిగ్గు తేల్చాల్సి ఉంది.

● కేంద్రం నిధులిచ్చినా..

వైసీపీ సర్కార్ గత ఐదేళ్లలో గ్రామీణ రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. గ్రామీణ రోడ్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా రూ. 175.06 కోట్లు మంజూరు చేసింది. కానీ వైసీపీ సర్కార్ గత ఐదేళ్లలో 2256 రోడ్లలో 954 రోడ్లను(42 శాతం) మాత్రమే చేసి చేతులు దులుపుకుంది. మిగిలిన 37 రోడ్లు మధ్యలో ఆగిపోగా.. 1265 రోడ్లు (56శాతం) ఇప్పటికీ ప్రారంభానికి (నాన్‌స్టార్టెడ్, పెండింగ్) నోచుకోలేదు. తద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు సరైన రోడ్ల సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకా రం.. జిల్లాలోని ఉరవకొండ, రాప్తాడు, రాయదుర్గం, తాడిపత్రి, గుత్తి, అనంతపురం రూరల్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్ల అభివృద్ధిపై వైసీపీ పాలకులు దృష్టి పెట్టకపోవడంతో అధికారులు సైతం వాటి గురించి ఆలోచించలేదు. పాలకులపై ఒత్తిడి పెంచి పనులు ప్రారంభించలేదు. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం గతంలో కేంద్రం మంజూరు చేసిన నిధులు ఏమయ్యాయో తెలుసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ఈక్రమంలోనే గత ఐదేళ్లలో జరిగిన పనులు, ఆగిపోవడానికి కారణాలను సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. గ్రామీణరోడ్లపై కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారించి ప్రజలకు అవస్థల ప్రయాణం తప్పించాలని పలువురు కోరుతున్నారు.

● జిల్లాలో మంజూరైన రోడ్ల పరిస్థితి ఇలా...

- జిల్లా వ్యాప్తంగా మంజూరైన రోడ్లు: 2256
- ఇప్పటికి పూర్తయినవి: 954
- పనులు జరుగుతున్నవి: 37
- ఎలాంటి పనులు చేయనివి: 1265
- కేంద్రం వెచ్చించిన నిధులు: రూ.175.06 కోట్లు
- ఇప్పటికి ఖర్చు చేసిన నిధులు: 76.03 కోట్లు
- పెండింగ్ బిల్లులు: రూ.50 కోట్లకు పైనే

ప్రభుత్వానికి నివేదించాం

కేంద్రం గత ఐదేళ్లలో ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రోడ్ల అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన నిధులు, జరిగిన పనులు తదితర అంశాలపై సమగ్ర నివేదికను తాజా ప్రభుత్వంతో పాటు ఆయా ప్రజాప్రతినిధులకు అందజేశాం. ఎక్కువ శాతం పనులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. గత ప్రభుత్వం నిధులు మళ్లించారనే విషయం మా చేతుల్లో లేని అంశం. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో అభివృద్ధి పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.



- కేవీ ప్రసాద్, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

కబ్జాలు చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ

అనంతపురం క్రైం, ఆగస్టు 12: ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ హెచ్చరించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విలువైన స్థలాలను ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జా చేయడం, సైబర్ నేరాల ఫిర్యాదులు ఇందులో ఉన్నాయి. మొత్తం 115 ఫిర్యాదులు అందాయని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్పీ అన్నారు. సమస్యలను సృష్టించేవారిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, అవతలి వ్యక్తులు నగ్నంగా ఉండి వీడియోకాల్ రికార్డు చేసి బెదిరిస్తారని, డబ్బులు కాజేస్తారని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు ఎట్టిపరిస్థితుల్లోనూ పెట్టకూడదని అన్నారు. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేవిధంగా, పార్టీల మధ్య చిచ్చు పెట్టే పోస్టులకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకర, అభ్యంతకర పోస్టులు పెడితే సహించబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని అన్నారు.



టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 12: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 3750టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.ఏడు పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలి పారు. మార్కెట్‌కు 190 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు టీబీ డ్యామ్‌కు మంత్రి కేశవ్



అనంతపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం తుంగభద్ర డ్యామ్‌ను సందర్శించనున్నారు. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి రాత్రి 9.50 గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన అర్ధరాత్రి 12 గంటలకు పెనుకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హంపి ఎక్స్‌ప్రెస్‌లో హోస్పేటకు వెళతారు. మంగళవారం ఉదయం తుంగభద్ర డ్యామ్‌ను సందర్శిస్తారు. నీటి ప్రవాహానికి డ్యామ్ గేట్ కొట్టుకు పోవడంతో చేపడుతున్న ప్రత్యామ్నాయ గేట్ ఏర్పాటు పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

O/o Executive Engineer,APMSIDC Division, JNTU Engineering College Road, Sarada Nagar, Govt Nursing College campus, Anantapuramu
'e' Procurement Short Tender Notice
No.02/EE/APMSIDC/ATP/2024-25/Dt.12-9-2024

Tender invited through 'e'Procurement platform for the work "Providing of 160 KVA DG set for Government Medical College at Ananthapuramu in Ananthapuramu District. (2nd Call) with total estimate cost of Rs.28.00 lakhs. The other details can be seen at website www.apeprocurement.gov.in Contact No.8297467436.

sd/- Executive Engineer,APMSIDC, Ananthapuramu

హేమావతి, శ్రీకాళహస్తి మధ్య పర్యాటక వలయం


ముఖ్యమంత్రికి పర్యాటక వలయం గురించి వివరిస్తున్న మైనాస్వామి (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 12: శ్రీ సత్యసాయి జిల్లా హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు ఆలయ పర్యాటక వలయం అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించినట్లు చరిత్ర పరిశోధకుడు, పర్యాటకరంగ నిపుణుడు మైనాస్వామి తెలిపారు. స్థానిక మాధవ రాయస్వామి ఆలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల అమరావతినిలో ముఖ్యమంత్రిని కలిసి పలు విషయాలు చర్చించినట్లు తెలిపారు. పర్యాటక వలయం పట్ల సీఎం సానుకూలంగా ఉండటంతో పూర్తి స్థాయి నివేదికను త్వరలో అందజేస్తానన్నారు. ఈపర్యాటక వలయం హేమావతిలోని సిద్దేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై పెనుకొండ, లేపాక్షి, గోరంట్ల, మేరెడ్డిపల్లి, మల్లెల, కదిరి, సోమపాళ్యం, వాయల్పాడు. శ్రీనివాస మంగాపురం, చంద్రగిరి, తిరుపతి, గుడిమల్లం, శ్రీకాళహస్తి ప్రసిద్ధ ఆలయంతో ముగుస్తుందన్నారు. వలయంలో ప్రముఖ ఆలయాలు, కోటలు, రాజభవనాలు, చారిత్రక ప్రదేశాలున్నాయన్నారు. పర్యాటక వలయంలో తీగ రవాణ మార్గాలు, (రోప్‌వే) సౌండ్అండ్ లైట్‌షో, లేజర్‌షో, పురావస్తు ప్రదర్శన శాలలు, పర్యాటక లఘు చిత్రాల ప్రదర్శన కేంద్రాలు, పిల్లల పార్కుల ఏర్పాటు, వసతి, మౌలిక సదుపాయల కల్పన, రవాణ సౌకర్యాలు మెరుగువంటి అభివృద్ధి కార్యక్రమాలుంటాయన్నారు. వలయం అభివృద్ధి పరచడానికి దాదాపు రూ.ఐదువందలకోట్లు అవసరమని, నిధులను వివిధ పథకాలద్వారా కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. ఆలయ పర్యాటక వలయం ఏర్పాటుతో ఆయా ప్రాంతాల అభివృద్ధితో పాటు వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

జేఎన్‌టీయూలో భారీగా బదిలీలు




అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: జేఎన్‌టీయూ నూతన యాజమాన్యం బాధ్యతలు చేపట్టిన నెలలోనే భారీగా బదిలీలకు శ్రీకారం చుట్టింది. గత వైసీపీ పాలనలో పారదర్శకతకు పాతరవేస్తూ రాజకీయ సిఫార్సులు, ప్రజా ప్రతినిధుల అండదండలున్న వారికి పెద్దపీటవేశారు. వైసీపీ నాయకుల కళాశాలల పనులను అడ్డదిడ్డంగా చక్కదిద్దేందుకు, స్వార్థ ప్రయోజనాలను ఒనగూర్చేలా గత వర్సిటీ యాజమాన్యం పలువురిని కీలక పోస్టుల్లో నియమించింది. ఈ వ్యవహారంపట్ల అప్పట్లో వర్సిటీ వర్గాలు అభ్యంతరాలు తెలిపినా పెడచెవిన పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పారదర్శకతకు పెద్దపీట వేశారని పలువురు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

20మంది టీచింగ్, నలుగురు బోధనేతర సిబ్బంది...

జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య సోమవారం 20మంది టీచింగ్, నలుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ)గా ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, ఓఎస్‌డీటు వీసీగా దేవన్న, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ విశాలి గోర్పాడేకు, వీసీ పేషికి నూర్‌మహమ్మద్, డీఏపీ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా లింగప్ప నియమితులయ్యారు. ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ వసుంధర వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. స్థానాల వారిగా ఉద్యోగోన్నతి, బదిలీ వివరాలు...

పేరు	ప్రస్తుత విభాగం	పదోన్నతి/బదిలీ
ప్రొఫెసర్ దేవన్న	కెమిస్ట్రీ	ఓఎస్‌డీటు వీసీ
ప్రొఫెసర్ సత్యనారాయణ	ప్రిన్సిపాల్, అనంతపురం	డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్
ప్రొఫెసర్ చెన్నారెడ్డి	కంప్యూటర్ సైన్స్	ప్రిన్సిపాల్, అనంతపురం
నాగప్రసాద్ నాయుడు	మెకానికల్, కలికిరి	డైరెక్టర్, ఎవాల్యుయేషన్
ప్రొఫెసర్ విశాలి గోర్పాడే	సివిల్, అనంతపురం	డైరెక్టర్, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	డైరెక్టర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ భానుమూర్తి	సివిల్, అనంతపురం	డైరెక్టర్, ఐసీఎస్
ప్రొఫెసర్ ప్రశాంతి	మెకానికల్, డైరెక్టర్, అనంతపురం	ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ పద్మసువర్ణ	ఫిజిక్స్, అనంతపురం	ఇన్‌చార్జ్ డైరెక్టర్, స్పాన్సర్డ్ రీసర్చ్
ప్రొఫెసర్ ఎస్.వైశాలి	ఈఈఈ, అనంతపురం	డైరెక్టర్, ఐఆర్ అండ్ పి
ప్రొఫెసర్ శివకుమార్	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ శ్రీధర్	ఈఈఈ, అనంతపురం	అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ అంకారావు	ఈఈఈ, అనంతపురం	అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
ప్రొఫెసర్ అరుణకాంతి	సివిల్, అనంతపురం	ప్రిన్సిపాల్, పులివెందుల
ప్రొఫసర్ వసుంధర	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	వైస్ ప్రిన్సిపాల్, అనంతపురం
డాక్టర్ ఓం ప్రకాష్	మెకానికల్, అనంతపురం	వర్సిటీ పీఆర్వో
డాక్టర్ అరుణ మస్తాని	ఈఈఈ, అనంతపురం	కోఆర్డినేటర్, అకడమిక్ అండ్ ప్లానింగ్
ప్రొఫెసర్ రమణారెడ్డి	ఈసీఈ, అనంతపురం	ఈసీఈ, కలికిరి
ప్రొఫెసర్ నగేష్‌కుమార్	ఈఈఈ, అనంతపురం	ఈఈఈ హెడ్, కలికిరి
నాగవేణి	ఏఆర్, అనంతపురం	ఏఆర్, కలికిరి
నూర్ మహమ్మద్	ఏఆర్, అనంతపురం	వీసీ పేషి
లింగప్ప	ఏఆర్, పులివెందుల	ఏఆర్, డీఏపీ సెక్షన్
సునీల్ కుమార్	వీసీ పేషి	సూపరింటెండెంట్, డీఎఫ్‌డీ

పంపకాల్లో తేడా.. దొరికిన దొంగలు


గొడవపడి దొరికింది వీరే..

బత్తలపల్లి, ఆగస్టు 12: చోరీ చేసిన సొత్తు పంపకాల్లో తేడాల కారణంగా ఘర్షణపడి ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన మోహన్ భార్య రాధమ్మ బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి రెండ్రోజుల క్రితం వచ్చింది. సోమవారం ధర్మవరం వెళ్లి, చీరలు కొనుగోలు చేసింది. అక్కడి నుంచి బత్తలపల్లికి బస్సులో వచ్చింది. బస్సు దిగాక తన మెడలోని 20 తులాల బంగారు నగలను తీసి, బ్యాగులో పెట్టుకుంది. మడుగుపల్లి వెళ్లేందుకు నార్పల బస్సు ఎక్కింది. బస్సులో ముగ్గురు మహిళలు.. ఆమెను మాటల్లో పెట్టారు. ఆమె దృష్టి మరల్చి బ్యాగులోని బంగారాన్ని కొట్టేశారు. మాల్యవంతం గ్రామంలో ఆ ముగ్గురు మహిళలు బస్సు దిగి, వెళ్లిపోయారు. బస్సు తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లికి చేరుకున్నాక రాధమ్మ.. తన బ్యాగులోని బంగారాన్ని చూసుకోగా.. కనిపించలేదు. ఆమె బోరున విలపిస్తూ విషయం బస్సు డ్రైవర్‌కు తెలిపింది. వెంటనే బస్సు ఆపి రాధమ్మ అక్కడే దిగేసింది. నార్పల వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడిని ఆపి, విషయం తెలిసింది. అతడు.. ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని మాల్యవంతంలో దిగిన మహిళల గురించి ఆరాతీయగా.. వారు బత్తలపల్లి వైపు ఆటోలో వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి బత్తలపల్లికి చేరుకున్నారు. గ్రామ శివార్లలోని నర్సరీల వద్ద ముగ్గురు మహిళలు బంగారు పంచుకోవడంలో తేడా రావడంతో పరస్పరం దాడి చేసుకుంటున్నారు. అటుగా వెళ్తున్నవారు పోలీసులకు సమాచారం అందించారు. అంతలోనే బాధిత మహిళ రాధమ్మ.. ఆ మహిళలను గుర్తించి, వారివద్దకు వెళ్లి వాదిస్తుండగా పోలీసులు అక్కడకు చేరుకుని, విచారించారు. మహిళా దొంగలను స్టేషన్‌కు తరలించి, చోరీ చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలను విచారించగా.. సరైన సమాధానం ఇవ్వడంలేదని తెలుస్తోంది.

అట్లెట్ల అవుతుంది ?

- 'సర్దుబాటు' కాని వ్యవహారం
- 31 మండలాల్లో టీచర్ల సర్దుబాటుకు కౌన్సెలింగ్
- తప్పుల తడకగా వేకెన్సీలు, సర్‌ప్లస్ వివరాలు
- బహిష్కరించిన టీచర్లు, సంఘాల నేతలు
- తప్పులు సరిదిద్దాలంటూ డీఈఓ ఆఫీస్‌కు...
- సవరణకు రెండు రోజుల అవకాశం: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై టీచర్లు, సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు జిల్లావ్యాప్తంగా సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే స్కూళ్ల వివరాలు, ఉపాధ్యాయులు ఖాళీలు, ప్లేసులు తదితర వివరాలు సక్రమంగా లేవని, అడ్డగోలుగా ఉన్నాయంటూ ఉపాధ్యాయులు, సంఘాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. చాలా మండలాల్లో కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు సంఘాల నాయకులు, టీచర్లు ప్రకించారు. ఎంఈఓలను, జిల్లా విద్యాశాఖాధికారులను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. దీంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. లోపాలు, టీచర్ల గ్రీవెన్స్‌లను సవరించడానికి ఎంఈఓలకు రెండు రోజులు అవకాశం కల్పించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు...

ఉపాధ్యాయుల సర్దుబాటుకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.


డీఈఓ ఆఫీస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన టీచర్లు

సోమవారం జిల్లాలోని అన్ని మండలాల్లో టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈక్రమంలో విద్యాశాఖ కమిషనరేట్ నుంచి అన్ని మండలాల్లో ఉన్న మిగులు టీచర్లు, అవసరమైన టీచర్లు, వారి సీనియారిటీ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారు. అయితే చాలా మండలాల్లో ఉపాధ్యాయుల వివరాలు, పోస్టుల సంచారం, ఖాళీలు చూపడంలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అనేక మండలాల్లో టీచర్లు ఆందోళన చెందారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులను కలుపుకుని ఎంఈఓలను కలిసి కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, పెద్దపప్పూరు ఇలా అనేక మండలాల్లో ఎంఈఓలను కలిసి సమస్యలను ఏకరువుపెట్టారు. ఉపాధ్యాయుల సర్దుబాటు అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. జీఓ 117 రద్దు చేసిన తర్వాత సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలని కోరారు.

టీచర్లు, హెచ్‌ఎంలు డీఈఓ ఆఫీస్ బాట...

మండలాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగానే చాలా మంది టీచర్లు, ప్రధానోపాధ్యాయులు డీఈఓ ఆఫీస్ బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా మిగులు టీచర్లు 1023 మంది, అవసరం (నీడ్) 585 మంది అంటూ రాష్ట విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉందని జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అయితే ఇచ్చిన సమాచారంలో లోపాలు ఉన్నాయంటూ పలువురు టీచర్లు, హెచ్‌ఎంలు డీఈఓ ఆఫీస్‌కు వచ్చిన ఫిర్యాదు చేశారు. బండమీదపల్లిలోని జడ్పీహైస్కూల్‌లో పనిచేసే టీచర్ స్కూల్ అసిస్టెంట్ కాగా... ఆయన ఎస్‌జీటీగా చూపారంటూ ఫిర్యాదు చేశారు. సర్దుబాటు ప్రక్రియ నుంచి ప్లస్ 2 స్కూళ్లను మినహాయించారు. అలాంటి స్కూళ్లలోని టీచర్లను సైతం సర్‌ప్లస్ చూపారు. ఇదే సమస్యలపై కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్ హెచ్‌ఎం డీఈఓ ఆఫీస్‌కు వచ్చి సమస్యను విన్నవించారు. ఇలా అనేక మంది టీచర్లు డీఈఓ ఆఫీస్ బాట పట్టారు. ఈనెల 16 వరకూ టీచర్ల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తామని, తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించేలా విద్యాశాఖ కమిషనర్ స్పష్టం చేసినట్లు తెలిసింది. కౌన్సెలింగ్, సర్దుబాటు ప్రక్రియను ఈనెల 16 వరకూ వాయిదా వేశారన్న దానిపై జిల్లా విద్యాశాఖాకారులు ధ్రువీకరించడం లేదు. ఉత్తర్వులు రాలేదంటూ...చెబుతున్నారు. దీనిపై వివరణ కోసం డీఈఓ వరలక్ష్మికి ఫోన్ చేయగా టీచర్ల నుంచి వచ్చే గ్రీవెన్స్‌ల సవరణకు రెండు రోజులపాటు ఎంఈఓలకు విద్యాశాఖ కమిషనర్ అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. సవరణల తర్వాత కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.


పెద్దపప్పూరులో ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు

8వ పీఆర్సీ వేయాలి: ఎంయూ

గుంతకల్లు, ఆగస్టు 12: పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించి, వెంటనే 8వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని నియమించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొత్త పింఛను విధానాన్ని విడనాడి, పాత పింఛనునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా 8వ పీఆర్సీని నియమించి వేతన సవరణలు చేయాలన్నారు. 2016 నుంచి రైల్వే ఉద్యోగుల కేడర్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలని, పెండింగులో ఉన్న 18 నెలల కరువు భత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ అశ్వని, కోశాధికారి శ్రీనివాస శర్మ, నాయకులు రాజశేఖర్, శీన, ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

స్టేషన్ మాస్టర్ల సంఘం..

స్టేషన్ మాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఎస్ఎం, ఎస్ఎంఆర్‌ల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ డివిజినల్ అధ్యక్షుడు రవిశంకర్, సంయుక్త కార్యదర్శి రవూఫ్ బాషా, నాయకులు పెద్దన్న, సుందరం, హరిప్రసాద్, సునీల్, దీపక్, మహేశ్వరి, సర్రాజ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై పునరాలోచించాలి: షకీల్ షఫి


సమావేశంలో మాట్లాడుతున్న షకీల్ షఫి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 12: వక్ఫ్ సవరణ చట్టం-2024పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని, ముస్లిం మతపెద్దలతో చర్చలు జరపాలని రాష్ట్ర ముతవల్లీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి డిమాండ్ చేశారు. ఏపీ ముతవల్లీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిర్వహించిన అఖిలపక్ష చర్చావేదికలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని పాలకులు విభజించు.. పాలించు అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ముస్లింలను అణగదొక్కేందుకు హిజాబ్, ఎన్ఆర్‌సీ వంటి చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు కొత్తగా వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చి ముస్లిం సామాజికవర్గాన్ని హరించేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ముస్లింలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, ఐక్య పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకుంటామని అన్నారు. ముస్లిమేతరులను వక్ఫ్‌బోర్డులో చేర్చే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ముతవల్లీలు, మత పెద్దలతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముస్లింల సంక్షేమం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆక్రమణకు గురైన 60శాతం వక్ఫ్ భూములను తిరిగి వక్ఫ్‌కే చెందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకునేవరకూ ఐక్య పోరాటాలు సాగిస్తామని, అవసరమైతే ఢిల్లీ వరకు పోరాటం నడుపుతామని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. మసీదుల్లో బయాన్ కన్నా ముందు వక్ఫ్‌పై అవగాహన కలిగేలా ప్రచారం కల్పించాలని, ఆ మేరకు ముతవల్లీలు చొరవ చూపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ సూచించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్‌మహ్మద్, టీడీపీ నాయకుడు తాజుద్దీన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, సైఫుద్దీన్, ఎంఎండీఏ ఇమామ్, సీనియర్ న్యాయవాది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేదో బాగుందే !

- బ్రహ్మజెముడు సాగుతో లాభాలు
- పంటకు నీటి వినియోగమూ తక్కువే
- ఎరువులు, మందుల అవసరం లేదు
- పశువుల మేతగా ఆకులు, కొమ్మలు


బ్రహ్మజెముడు పంట

గుత్తిరూరల్, ఆగస్టు 12: ఆరేళ్ల కిందట తీవ్ర కరువు ఏర్పడి పశువుల మేత కూడా దొరకని దుస్థితి నెలకొంది. ఆ సమయంలో గ్రాసం కొరతను కొద్దిమేర తగ్గించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఆర్‌డీఏ, వెలుగు సంస్థ బ్రహ్మజెముడు అనే కొత్తరకం సాగుకు శ్రీకారం చుట్టింది. అయితే రైతులు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. చివరికి గుత్తి మండలం ఊటకల్లు గ్రామంలో వెంకటేశ్వర రెడ్డి అనే రైతు ముందుకు రాగా.. ఆ రైతు చేత బ్రహ్మజెముడు పంటను సాగు చేయించింది. పూణే నుంచి వాటి మొక్కలు తెప్పించి మరీ సాగు చేయించింది. జిల్లాలోనే తొలి సారిగా తన రెండు ఎకరాల పొలంలో ఆయన 2100 మొక్కలను నాటారు. ఒక్కో మొక్కను ఆరు అడుగుల దూరంలో నాటారు. ఒక్కసారి సాగు చేస్తే కొన్నేళ్లుగా పంట అలాగే ఉంటుంది.

మొక్కకు లీటరు నీరు పోస్తే చాలు

బ్రహ్మజెముడు సాగుకు నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. నాటిన రోజు నుంచి 15 రోజులకొకసారి ఒక్కో మొక్కకు ఒక లీటరు నీటిని పోయాలి. ఆ తర్వాత మొక్క ఎదుగులను బట్టి నీటిని పో యాలి. మొక్క బతికిన తర్వాత నీటిని పోయాల్సిన అవసరం లేదు. ఈ పంటకు ఎరువులు, మందులు కూడా అవసరం ఉండదు. వర్షాలు లేకున్నా బెట్ట పరిస్థితిని తట్టుకొని మొక్కలు ఎదుగుతాయి. ఎటువంటి నేలల్లో అయినా దీన్ని సాగు చేసుకోవచ్చు.


విరగ్గాసిన బ్రహ్మజెముడు పండ్లు

పాడి పశువులకు మేతగా..

బ్రహ్మజెముడు ఆకులు, కొమ్మలు పశువులకు మేతగా ఎంతో ఉపయోగపడతాయి. వాటి ఆకులను, కొమ్మలను ముక్కలుగా చేసి దాణాగా వాడుకోవచ్చు. వాటి ఆకుల్లో, కొమ్మల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక పాడి పశువుల్లో పాల దిగుబడి పెరగడానికి ఈ గ్రాసం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇతర ప్రాంతాలకు సరఫరా



నేను రెండు ఎకరాల్లో బ్రహ్మజెముడు పంటను సాగు చేశాను. ఒక్కో ఆకు రూ. 30 నుంచి రూ.40 వరకు అమ్ముతాను. విజయవాడకు, వినుకొండ, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూడా ఈ ఆకులను సరఫరా చేశాను. అయితే వీటి పండ్లకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్రభుత్వం బ్రహ్మజెముడు పండ్లను కొనుగోలు చేసి ఇతర ప్రాంతలకు దిగుమతి చేయాలి. అపుడు ఆదాయం పెరుగుతుంది.

- వెంకటేశ్వర రెడ్డి, రైతు, ఊటకల్లు.

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 12: రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పలు చోట్ల కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో అనంత చిన్నారికి రజతం


రజతం సాధించిన చిన్నారి హత్విక్

అనంతపురం విద్య, ఆగస్టు 12: జాతీయ స్థాయిలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన చిన్నారి హత్విక్ రెడ్డి వెండి పతకం సాధించాడు. నగరంలోని సరస్వతి విద్యామందిర్‌లో రెండో తరగతి చదువుతున్న హత్విక్‌రెడ్డి ఈ నెల ఏడు నుంచి 11వ తేదీ వరకూ తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 5-7 ఏళ్ల విభాగంలో పాల్గొన్నాడు. పోటీల్లో సత్తా చాటి...రజత పతకం సాధించాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్టీఆర్ రోలింగ్ స్కేటింగ్ అకాడమీలో కోచ్ ఆంజనేయులు దగ్గర శిక్షణ పొందాడని, నేషనల్ స్థాయిలో పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

గురుకులాల్లో ఖాళీలు లేవు

అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 12: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సీట్లు ఖాళీ లేవని అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ సీట్లు ఖాళీల్లేవన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాలకు బ్రాగ్‌సెట్ నిర్వహించి మెరిట్ లిస్టు ప్రకారం సీట్లను భర్తీ చేశామన్నారు. మిగిలిన సీట్లను ప్రజాప్రతినిధులు, అనాథల నుంచి వచ్చిన గ్రీవెన్స్‌ను పరిశీలించి మెరిట్ ప్రకారం రిజర్వేషన్ పద్ధతిన అడ్మిషన్లు కేటాయించామన్నారు. అయితే జిల్లాలో సీట్లకు ఎక్కువ డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఒక్కో గురుకులానికి 10 సీట్లు పెంచాలని గురుకుల పాఠశాల సెక్రటరీకి జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మెరిట్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తామన్నారు. సీట్ల కోసం డీసీఓ కార్యాలయానికిగానీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు రావద్దన్నారు. ఇంటర్‌లో నల్లమాడ, బ్రహ్మసముద్రం, ఉరవకొండ గురుకులాల్లో సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీలలో ఖాళీలు, మార్కుల ఆధారంగా నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం


కేఎస్ఎన్ కళాశాలలో విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 60 ప్రైవేట్ కళాశాలలకు 10న సీట్లను కేటాయించారు. అలాట్‌మెంట్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో 16కు రిపోర్ట్ చేసుకోవాలి. విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్ల మేరకు వారి ఇంటర్మీడియేట్ మార్కులు, కేటగిరి, మెరిట్ ఆధారంగా ఆటోమేటిక్ కంప్యూటరైజ్డ్ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుంది. అయితే నచ్చిన కళాశాల, కోర్సులు కాకుండా ద్వితీయ ఆప్షన్స్‌లో అలాట్‌మెంట్ అయిన విద్యార్థులు చేరాలా? వద్దా? అంటూ సందిగ్ధంలో పడుతున్నారు. కళాశాలకెళ్లి భౌతికంగా రిపోర్ట్ చేయకుంటే కేటాయించిన సీటు రద్దు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. తొలి కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం నిర్వహించే ద్వితీయ కౌన్సెలింగ్‌లో మరోసారి నచ్చిన కళాశాల, కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవాలంటే.. ప్రస్తుతం అలామెంట్ అయిన సీట్‌లో అడ్మిషన్ అవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సిఫార్సులకు సీట్లు దక్కవు...

వర్సిటీల వారిగా వాటి పరిధిలోని కళాశాలలకు ఆఫ్‌లైన్ అడ్మిషన్లు చేసుకునే ప్రక్రియకు ముగింపు పలికి, రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో ఆన్‌లైన్ విధానం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్, అలాట్‌మెంట్ ఇలా మొత్తం ప్రక్రియ కంప్యూటరైజ్డ్ అయిపోయింది. ప్రతిభ ఆధారంగా విద్యార్థి స్థానిక ప్రాంతంలోని కళాశాలలకు సీటు అలాట్మెంట్ అవుతోంది. ఈ నేపథ్యంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులకు అడ్మిషన్ ప్రక్రియలో ఏమాత్రం సంబంధం ఉండదు. ఈ విషయం తెలియక గత వైసీపీ ప్రభుత్వంలో డిగ్రీ సీట్లు కావాలని సిఫార్సు చేసేవారు. అదే వరసను ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, వారి అనునాయులు కొనసాగిస్తున్నారని కళాశాలల అధికారులు వాపోతున్నారు. తమ చేతుల్లో ఏమిలేదని వివరించినా మినిస్టర్‌తో చెప్పించాలా? అంటూ ఒత్తిడి చేస్తుంటే జవాబివ్వలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా దబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647 AJA- 189295

Tractor Executives

బుక్కరాయసముద్రం, రాప్తాడు, ఆత్మకూరు, పామిడి, గార్లదిన్నె, రామగిరి,బత్తలపల్లి, వజ్రకరూర్, ఉరవకొండ, గుంతకల్ మండలాలలో స్వరాజ్ ట్రాక్టర్స్‌కు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. ట్రాక్టర్ ఫీల్డ్‌లో 2-5 సం॥లు అనుభవం, సం॥ప్ర॥ శ్రీ విజయ ట్రాక్టర్ ఏజెన్సీస్, గుత్తిరోడ్డు, ATP, Cell:8374559867, 8465066566,7799133395 AJA-198023

PROPERTY FOR SALE

★ Biappa approved plots for sale. Shalvi Garden-New Launch. Only 41 Plots available. Devanahalli, Bengaluru north 10-15 mins drive to airport, prestige cloud tech park and others. Price: 4,500 Rs per Sft (neg). Contact number: 96521-12565 or 99895-49365 AJH-19353

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926. AJA-198020

మా చిత్రంలో నటించే అవకాశం

★ [illegible] AJH-002570

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన



ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అనంతపురం టౌన్, ఆగస్టు 12: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సర్వజన ఆస్పత్రి కార్మికులు ఆందోళన చేపట్టారు. బకాయి వేతనాలు చెల్లించాలని, జీఓప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. ఏఐటీయూసీ నాయకులు రాజారెడ్డి, రాజేష్‌గౌడు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కొన్నిరోజులుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులు మేరకు కనీస వేతనాలు చెల్లించకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. నాయకులు మనోహర్, వెంకటేష్, రామాంజనేయులు, భార్గవి, నారప్ప, ప్రశాంత్ పాల్గొన్నారు.

నృత్యపోటీల్లో అనంత వాసుల ప్రతిభ



ద్వితీయ బహుమతి అందుకున్న లహరి డ్యాన్స్ అకాడమీ హరి బృందం (ఇన్‌సెట్‌లో) ప్రథమ బహుమతి సాధించిన శ్రీవైష్ణవి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 12: జాతీయస్థాయి నృత్యపోటీల్లో అనంతవాసులు ప్రతిభ చాటారు. రాయలసీమ రంగస్థలి, శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 9 నుంచి 11వ తేదీ వరకు జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. అనంతపురం నగరానికి చెందిన లహరి డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రతిభ కనబర్చారు. పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి సోమవారం బహుమతుల ప్రదానం చేశారు. జానపద సోలో డ్యాన్స్ సీనియర్స్ విభాగంలో శ్రీవైష్ణవికి ప్రథమ బహుమతి, గ్రూప్‌డ్యాన్స్ సీనియర్స్ విభాగంలో లహరి డ్యాన్స్ అకాడమీ హరి బృందానికి ద్వితీయ బహుమతులను అందజేశారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా జట్లు విజయం సాధించాయి. బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. ఉదయం జరిగిన పోటీల్లో ఛత్తీస్‌గఢ్‌పై ఒడిశా విజయం సాధించింది. మిజోరాంపై ఢిల్లీ జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, బి.మల్లేష్, టీడీపీ నాయకులు రమణ, నారాయణస్వామి, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీవీ-5 కెమెరామన్ శేఖర్ మృతి



అనంతపురం క్రైం, ఆగస్టు 12: టీవీ-5 కెమెరామెన్ శేఖర్ (42) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అనంతపురం నగరం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న శేఖర్ రాత్రి 9 గంటల సమయంలో తన ఇంట్లోనే గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శేఖర్‌కు భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. టీవీ-5 కెమెరామెన్‌గా శేఖర్ గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన అత్యక్రియలు బుధవారం నిర్వహిస్తున్నట్లు కటుఉంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మృతిపై జర్నలిస్టుల సంఘం, కెమెరామెన్ యూనియన్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

గార్లదిన్నె, ఆగస్టు 12: మండల పరిధిలోని పాతకల్లూరు గ్రామంలో సోమవారం లలిత (20) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు పాత కల్లూరుకు చెందిన మల్లికార్జునకు పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, ఓబిలేసు దంపతుల కుమార్తె లలితను ఇచ్చి నాలుగు సంవత్సరాలు క్రితం వివాహం చేశారు. మల్లికార్జున, లలిత దంపతులిద్దరు కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. వీరికి రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. కొంతకాలంగా లలితను మల్లికార్జున అనుమానిస్తుండడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు, చుట్టుపక్కల వారు తలుపులు తీసి చూడగా ఆమె ఉరికి వేలాడుతుండడంతో వెంకటనే చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కుమార్తెను అల్లుడే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని తలిదండ్రులు ఆరోపించారు. కుమార్తె మృతి పట్ల అనుమానం ఉందని అల్లుడిపై పోలీసులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

శింగనమల, ఆగస్టు 12: మండలంలోని సలకంచెరువు గ్రామానికి చెందిన ఎల్.ఓబయ్య(35) అనే వ్యక్తి అప్పులు బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఎల్.క్రిష్టయ్య రెండో కూమారుడు ఓబయ్యకు పెళ్లి కాలేదు. గ్రామంలో చిన్నచిన్న పనులు చేసుకునేవాడు. ఓబయ్య మద్యంతో దురలవాట్లకు లోనాయ్యడు. ఇందుకోసం రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. అప్పులవారు ఒత్తిడి చేయడంతో మనస్థాపంతో ఆదివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబసభ్యులు అతనిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చితంబరి తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి...

బుక్కరాయసముద్రం, ఆగస్టు 12: అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని అనంతసాగర్ కాలనీలో అప్పుల బాధతో చింతకాయల వీరాంజనేయులు (35) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతసాగర్ కాలనీకి చెందిన చింతకాయల వీరాంజనేయులు టైలర్‌పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇంటి జీవనం కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తిచెంది సోమవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం క్రైం, ఆగస్టు 12: పాతూరులో మట్కా రాస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పాతూరుకు చెందిన సరస్వతి, జబీవుల్లా మట్కా రాస్తుండగా అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,750 స్వాధీనం చేసుకున్నారు.

మధ్యప్రదేశ్ వాసి మృతి: విద్యుదాఘాతానికి గురై మధ్యప్రదేశ్ వాసి మృతి చెందాడు. అనిల్‌సింగ్ చౌహాన్(48)డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం టమోటాలు లోడ్ చేసే సమయంలో తడిసిన తాడును పైకి విసిరాడు. ఆ తాడు 11కేవీ విద్యుత్‌లైన్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో గొంతుకోసుకున్న డ్రైవర్

మద్యం మత్తులో ఓ వ్యక్తి గొంతుగోసుకున్నాడు. కురుగుంటకు చెందిన మల్లికార్జున ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటెల్ కళాశాల ఎదుట కత్తితో గొంతుకోసుకున్నాడు. స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. భార్యాభర్తల మధ్య విభేదాలతోనే గొంతు కోసుకున్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూములను ఆక్రమించారు

- మీరే న్యాయం చేయాలి
- ఎమ్మెల్యే పరిటాల సునీతకు బాధితుల వినతి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 12: అమ్మా.. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు దౌర్జన్యంగా మా భూములను ఆక్రమించుకున్నారు. వారిని ఎదిరించలేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చింది. ఎమ్మెల్యేగా మీరే మాకు న్యాయం చేయాలంటూ పలువురు బాధితులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో మొరపెట్టుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్యలను విన్నవించారు. వారి నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలు పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. తాము ఎన్నో ఏళ్ల నుంచి సాగులో ఉన్నా ఆన్‌లైన్ నుంచి తొలగించామని వైసీపీ నాయకులు వారి పేర్లను నమోదు చేసుకున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా అప్పట్లో తమ పింఛన్లను తొలగించారని మరి కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు తాగునీరు సక్రమంగా లేదని వాటర్‌ఫిల్టర్ ఉన్నా మూలన పెట్టారని ఎస్ఎంసీ ఛైర్మన్‌హరి ఫిర్యాదుచేయగా ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓలతో పాటు హెచ్ఎంలను పిలిపించి చురకలు అంటించారు. శ్మశానికి స్థలం కేటాయించాలని పలువురు స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి, తహసీల్దార్ హమీద్‌బాషా, ఈఓఆర్డీ అశోక్ నాయక్, ఏఓ ఉదయ్‌కుమార్, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీఎంపీపీ అంకే అమరేంద్ర, అధికారులు పాల్గొన్నారు. అనంతరం శాఖల వారిగా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. గత వైసీపీ ప్రభుత్వంలో భూములను లాక్కోవడం, ఆన్‌లైన్‌లో తొలగించడం వంటి సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై దృష్టిసారించాలని తహసీల్దార్ హమీద్‌బాషాను ఆదేశించారు.

నేడు కనగానపల్లికి ఎమ్మెల్యే రాక

ధర్మవరం రూరల్ (కనగానపల్లి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పరిటాలసునీత మంగళవారం కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి వస్తున్నట్లు టీడీపీ మండలకన్వీనర్ యాతంపోతలయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళా డాక్టర్ హత్యాచారంపై మెడికోల ఆందోళన



డాక్టర్ హత్యాచార ఘటనపై ఆందోళన చేస్తున్న డాక్టర్లు, మెడికోలు

అనంతపురం టౌన్, ఆగస్టు 12: కోల్‌కతా మెడికల్ కళాశాలలో మహిళా డాక్టర్‌ను అత్యాచారంచేసి హత్య చేసిన నరరూపరాక్షసుడిని కఠినంగా శిక్షించాలని డాక్టర్లు, మెడికోలు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై నగరంలో డాక్టర్లు, మెడికోలు సోమవారం రోడ్డెక్కి నిరసన చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేశారు. ప్రభుత్వ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు రామస్వామి నాయక్, ఐఎంఏ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఆర్ఎంఓ హేమలత మాట్లాడుతూ కోల్‌కతా ఘటన అమానుషమైన చర్య అన్నారు. ఇలాంటి దుర్మార్గుడిని కఠినంగాశిక్షించాలని, డాక్టర్లకు భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు శివశంకరనాయక్, విజయకుమారి, పరదేశీనాయుడు పాల్గొన్నారు.

పీజీ హాస్టల్స్ వద్ద భద్రత కల్పించండి

అనంతపురం టౌన్: కలకత్తా మెడికల్ కళాశాలలో పీజీచేస్తున్న మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యచేశారని, అదిచూస్తే భయమేస్తోంది, అనంత వైద్యకళాశాల పీజీ హాస్టల్స్ వద్ద భద్రత కల్పించాలని పీజీ వైద్యవిద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పీజీ కాలేజీ హాస్టల్స్‌లో ఇప్పటికే రెండుసార్లు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారన్నారు.

గంపమల్లయ్య గుహలోకి పూజారిని అనుమతించండి

శింగనమల, ఆగస్టు 12: గంపమల్లయ్య స్వామి కొండ గుహలోకి పూజారిని అనుమతించాలని ఆనందరావుపేట గ్రామానికి చెందిన ప్రజలు అధికారులను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆనందరావుపేట గ్రామస్థులు, పూజారి కుటుంబ సభ్యులతో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఏఎస్ఐ చితంబరయ్య సమావేశం నిర్వహించారు. గ్రామస్థులు, పూజారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. గంపమల్లయ్య కొండ గుహలో దశాబ్ద కాలంగా స్వామివారికి శ్రావణ మాసంలో నాలుగు లేక ఐదు వారలు వెళ్లి ప్రత్యేక పూజలు చేయడం ఆచారమన్నారు. 2022లో పాపాయ్యపూజారి ప్రమాదవశాత్తు గుహలో దిగేసమయంలో కిందపడి మృతి చెందాడన్నారు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు గుహ ప్రవేశం నిషేధించినట్లు తెలిపారన్నారు. డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐ మాట్లాడుతూ స్వామివారి గుహ ప్రవేశానికి ఎలాంటి అనుమతులు లేవని, ముఖ్యంగా గుహ ప్రవేశ సమయంలో పూజారితోపాటు భక్తులకు ఏమైనా ప్రమాదలు జరిగితే ఎవరు బాధ్యత వ్యహరిస్తారని ప్రశ్నించారు. గుహ ప్రవేశానికి పైఅధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేనిదే ఎవరైనా ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరిటాల శ్రీరామ్‌కు సన్మానం



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న టీడీపీ బి.యాలేరు నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 12: ఆత్మకూరు మండలం బి.యాలేరు హైస్కూల్ కమిటీ ఛైర్మన్‌గా నాగరాజు ఎంపికైన సందర్భంగా ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం బి. యాలేరు హైస్కూల్ కమిటీ ఛైర్మన్ నాగరాజు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, స్థానిక నాయకులు మధు, పెద్దన్న, వసంత్, నరసింహులు, దాదులూరిలు పరిటాల శ్రీరామ్‌కు పూలమాల వేసి, శాలువ కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్ రహిత ఏపీ స్థాపనకు కలిసిరావాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12: డ్రగ్స్ రహిత ఏపీని స్థాపించేందుకు అందరూ ముందుకు రావాలని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏడీసీసీ బ్యాంకులో నషా ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ రహిత ఏపీ స్థాపనకు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. డీసీఓ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన భారతదేశంలో డ్రగ్స్ సమస్య పట్టిపీడిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్రకీలకమన్నారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు యువతపాత్ర కీలకమన్నారు. ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

బకాయి వేతనం చెల్లించండి

పెండింగ్‌లో ఉన్న 37నెలల బకాయి వేతనం చెల్లించాలని డ్వామాలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ మురళీధర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఆయన అర్జీ అందజేశారు. డ్వామాలో 15 ఏళ్లుగా టీఏగా పనిచేస్తున్నానని, తనపై కక్షపూరితంగా 37 నెలలుగా వేతనం చెల్లించకుండా అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వక్ఫ్‌బోర్డుపై కేంద్రం జోక్యం లేకుండా చూడాలి

అనంతపురం అర్బన్, ఆగస్టు 12: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకంగా ఉందని, బోర్డుపై కేంద్రం జోక్యం లేకుండా చేయాలని రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారాలోకేశ్‌కు టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ కోరారు. సోమవారం మంగళగిరిలోని మంత్రి నివాసంలో నారాలోకేశ్‌ను కలిసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్నికలపై విద్యార్థుల్లో అవగాహన

అనంతపురం విద్య, ఆగస్టు 12: ఎన్నికలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో స్టూడెంట్ ఎలక్షన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏజీఎం మాట్లాడుతూ ప్రభుత్వాల ఏర్పాటుకు ఎన్నికలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ నేత్రావతి, జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, డీన్ అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



నడిపన్న మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, ఆగస్టు 12: మండలంలోని బొమ్మేపర్తికి చెందిన టీడీపీ నాయకుడు మెండి నడిపన్న మృతికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళి అర్పించారు. నడిపన్న మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం బొమ్మేపర్తికి వెళ్లి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ శీనయ్య పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: టీడీపీ నాయకుడు అంకే అంజనేయులును ఎమ్మెల్యే పరిటాలసునీత, ఎల్ నారాయణచౌదరి సోమవారం పరామర్శించారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి వైద్యం తీసుకుంటున్న తీరును గురించి తెలుసుకున్నారు.

విద్యుత్‌శాఖ ఎంఅండ్‌పీ-2 ఈఈగా రవిశంకర్

అనంతపురం రూరల్, ఆగస్టు 12: విద్యుత్ శాఖ మీటర్స్ అండ్ ప్రొడక్షన్-2 ఈఈగా రవిశంకర్ నియమితుడయ్యారు. ఆ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. ఈయన తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో విజిలెన్స్ విభాగంలో డీఈఈగా పనిచేస్తున్నారు. ఈయనకు ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేశారు. అలాగే కడపలో ఏఈఈగా పనిచేస్తున్న రాధిక అనే అధికారిని జిల్లా కేటాయించారు.

సమగ్రశిక్ష నోటిఫికేషన్‌ను రద్దుచేయాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: సమగ్ర శిక్ష కార్యాలయంలోని సెక్టోరియల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీచేసేందుకు జారీచేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దుచేయాలని ఆర్‌ఈఎఫ్ రాయలసీమ అధ్యక్షుడు ఎంటీ నాగభూషణం సోమవారం ప్రకటనలో డిమాండ్‌చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత మార్గదర్శకాలతో సమగ్రశిక్ష పోస్టులను భర్తీచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా అవే తప్పిదాలను అమలుచేస్తూ అర్హులైన వారికి అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా కీలక అధికారులు వారి సొంత నిర్ణయాలు అమలుచేసేలా నోటిఫికేషన్‌ను జారీచేశారన్నారు. గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ఎంఈఓలను నియమిస్తేనే ప్రభుత్వ అదేశాలు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలౌతాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్ రద్దుచేయకపోతే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి అర్హులకు న్యాయం జరిగేలా పోరాడుతామని హెచ్చరించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

శింగనమల, ఆగస్టు 12: రైతులకు పెట్టుబడి సాయం కింద వెంటనే రూ.20వేలు అందించి అదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు సాగు చేశారని, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలుతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు మధుయాదవ్, బయన్న, నేసే మధు, రామసూబ్బారెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎర్రిస్వామి, శీనా, సుంకన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతి పత్రాన్ని అందచేస్తున్న నాయకులు

గార్లదిన్నె, ఆగస్టు 12: సత్యసాయి నీటిని సరఫరా చేయించి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కల్లూరు, కనుంపల్లి, బూదేడు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి విన్నవించారు. సోమవారం పలు గ్రామాలకు చెందిన వారు అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. వారు మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కొన్నిరోజుల నుంచి నిలిచిపోయాయన్నారు. తాగునీటి సమస్య ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు సామాల మధు, మిట్టరాజా, మల్లికార్జున ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి: ఎమ్మెల్యే

శింగనమల: నియోజకవర్గంలో లబ్ధిదారులకు డీలర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. సోమవారం మండల డీలర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చే నెల నుంచి బియ్యం, చక్కెర, కందిబేడలు ఇతర వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. డీలర్లు చెన్నయ్య, కాయల రమణ, ప్రతాప్ పాల్గొన్నారు.

15న అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



బళ్లారి బైపాస్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఆగస్టు 12: నగరంలో 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్ల ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బళ్లారి బైపాస్‌లోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. క్యాంటీన్‌లోని ఫర్నిచర్, తాగునీరు, వంట గదిని పరిశీలించారు. ఎక్కడా చిన్న లోటు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పేదలకు అన్నం పెట్టే ఈ కార్యక్రమాన్ని సేవా భావంతో చూడాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మూడు పూటలా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను తన అహంకారంతో జగన్‌రెడ్డి మూసివేయించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్యాంటీన్లను తిరిగి పునరుద్ధరించామన్నారు. నగరంలోని మూడు క్యాంటీన్లను రూ.30 లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు క్యాంటీన్లను తిరిగి పునఃప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు పెరిగినా క్యాంటీన్లలో ధరలు పెంచడం లేదన్నారు. అడిషనల్ కమిషనర్ హరిబాబు, ఈఈ సూర్యనారాయణ, ఏఈ శంకర్, టీడీపీ నాయకులు రాయల్ మురళీ, గంగారామ్, డిష్ నాగరాజు, నెట్టెం బాలకృష్ణ, రాయల్ మధు, దళవాయి వెంకటనారాయణ, సంగా తేజస్విని, వడ్డే భవాని, లక్ష్మీనరసింహ, ఓంకార్ రెడ్డి, రమేష్ బాబు, జోగి రాజేంద్ర, గోళ్ల సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి తన ఇంట్లో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను సోమవారం రాత్రి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పరామర్శించారు.

సర్దుబాటు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్‌ను కోరారు. సోమవారం టీఎన్‌యూఎస్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ ఇతర సంఘాల నాయకులు ఎమ్మెల్యేను అర్బన్ కార్యాలయంలో కలిశారు. వారు మాట్లాడుతూ... సర్దుబాటు నిర్ణయం...టీచర్లను గందరగోళానికి గురిచేలా ఉందన్నారు. టీచర్లతో ఎలాంటి సమీక్షలు చేయకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో 117 జీవో రద్దు చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అయితే రద్దు చేయకుండానే ఇప్పుడు విద్యాశాఖ సర్దుబాటు చేస్తుండటం వల్ల టీచర్ల తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. నాయకులు ఫణిభూషణ్, సురేష్, ఓబులేసు, భాగ్యరాజ్, నాగేంద్ర, శేషు, నాగభూషణం నాయుడు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

రామగిరి: ఉపాధ్యాయుల పనిసర్దుబాటుపై ఇచ్చిన జీఓను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ శ్రీనివాసులకు ప్యాప్టో సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. జీఓ నెంబరు 117ను రద్దుచేసి జీఓ ఎంఎస్ నెంబరు 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, యూటీఎఫ్ జయచంద్రారెడ్డి, నరసింహులు, హరిప్రసాద్, కేశవనారాయణ, శ్రీనివాసులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు అంగన్‌వాడీ కార్యకర్త



నిర్మలమ్మ

అనంతపురం విద్య, ఆగస్టు 12: దేశరాజధాని ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యే అరుదైన అవకాశం ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు దక్కింది. నగరంలోని నేతాజీకాలనీలో ఉన్న సెంటర్‌లో నిర్మలమ్మ పనిచేస్తోంది. ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణలో మెరుగైన ప్రమాణాలు పాటించడం తదితర కారణాలతో ఇటీవల అధికారులు ఆమె పేరును ప్రతిపాదించారు. దీంతో ఆమెకు ఢిల్లీ నుంచి ఆహ్వానం వచ్చింది. ఎర్రకోటలో 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరయ్యేందుకు ఆమె సోమవారం బయలుదేరి వెళ్లారు. ఢిల్లీకి ఆహ్వానం రావడంతో ఆమెభర్త పెద్దిరెడ్డి, ఇతర కుటుంబికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యువ కార్యకర్త మహిమ



అనంతపురం క్లాక్‌టవర్: ఢిల్లీలో 15వతేదీన నిర్వహించే 78వ స్వాతంత్ర్య వేడుకలకు జిల్లాకు చెందిన నెహ్రూ యువకేంద్రం యువ కార్యకర్త మహిమ ఎంపికైంది. దేశ వ్యాప్తంగా ఎంపికచేసిన 78మంది జాతీయ యువ కార్యకర్తల్లో నగరంలోని విజయనగర్ లా కళాశాలలో చదువుతున్న మహిమ వేడుకల్లో పాల్గొననున్నారు. జిల్లా నెహ్రూయువకేంద్రం అధికారి మణికంఠ, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు మహిమను అభినందించారు.

రామ్మోహన్‌రావుకు డాక్టరేట్



అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో పరిశోధక విద్య పూర్తిచేసిన రామ్మోహన్ రావుకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి డాక్టరేట్‌ను జారీ చేశారు. 'ఎన్స్యూరింగ్ ప్రైవసీ ప్రిజర్వేషన్ ఫర్ డేటా అనలటిక్స్' అనే అంశంపై తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో రామ్మోహన్‌రావు పరిశోధన చేశారు. పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్న రామ్మోహన్‌రావును పలువురు అభినందించారు.

విద్యార్థినుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్

అనంతపురం రూరల్, ఆగస్టు 12: విద్యార్థినుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కురుగుంట కేజీబీవీ పాఠశాలను న్యాయాధికారి సందర్శించారు. వసతి గృహాలు, తరగతి గదులు, వంటగది పరిశీలించారు. భోజన నాణ్యతను, వంటను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై స్థానికంగా ఉన్న వసతులను అడిగితెలుసుకున్నారు. ఇబ్బందులు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. డీసీడీఓ వాణిదేవి, ఎస్ఓ నర్మద పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ ఫెడరేషన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బావిగడ్డ రమణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ ఉద్యమం కీలకమన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, హనుమంతు, మంజు, ఉమామహేష్, నాని, సమీర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12: పట్టణంలోని హనుమేష్ నగర్‌కు చెందిన అరవింద్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి సోమవారం పరామర్శించారు. అధైర్య పడొద్దని, ధైర్యంగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుడి భార్యకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

పామిడి, ఆగస్టు 12 : పామిడి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పామిడి గ్రామ పంచాయతీని నగర పంచాయతీగా మార్చినందుకు గత 2012లో ఉపాధి హామీ పథకం పనులు నిలిచిపోయాయన్నారు. తిరిగి 2022లో నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మార్చారన్నారు. అయినా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పనులు కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రహీం, మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

పామిడి, ఆగస్టు 12 : పాము కాటుకు గురైన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని పీ కొండాపురం గ్రామానికి చెందిన వన్నెపోగుల ఓబులేసు రెండో కుమార్తె మానస (15) గత ఐదు రోజుల క్రితం ఇంటి వద్ద పాము కాటుకు గురైంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాలికను పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆర్ఆర్ రమేష్ రూ. 5వేలు, నరసప్ప రూ. 5వేలు బాలిక కుటుంబానికి సోమవారం ఆర్థికసాయం అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కళ్యాణదుర్గం (కంబదూరు), ఆగస్టు 12 : కంబదూరు మండలం చెర్లోపల్లి గ్రామపరిసరాల్లో పేకాట స్థావరంపై సోమవారం దాడులు చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని, పేకాట ఆడుతున్న బాబు, నాగరాజు, శ్రీనివాస్, నాయక్, రామాంజిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 37,900లు నగదును, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కుందుర్పి: మండలంలోని నిజవళ్లి గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు చేసి పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి వారిని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి రూ. 6700ల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఏపీఓగా విజయభారతి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 12: రాయదుర్గం మండల ఏపీఓగా విజయభారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పామిడి మండల ఏపీఓగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి బదిలీ అయ్యారు.

దాసరి కులస్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

గుత్తి, ఆగస్టు 12: రాష్ట్రంలోని దాసరి కులస్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని దాసరి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో దాసరి వీధిలో దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సభ జరిగింది. దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవి, సంచాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసులు, తోలుబొమ్మలాట కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునపాల్గొని మాట్లాడారు. దాసరి కులాలకు రాష్ట్రంలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిఘా నీడలో తహసీల్దార్ కార్యాలయం

కూడేరు, ఆగస్టు 12: మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు భాగంతో పాటు రికార్డుల రూములో కెమెరాలు ఏర్పాటు చేశారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులను దహనం చేయడంతో అప్రమత్తమైన అధికారులు కూడేరు మండలంలో కూడా ప్రభుత్వ భూములు అధికంగా ఉండటం, కోట్ల విలువ చేసే భూములకు సంబంధించిన ఫైళ్లు రికార్డు రూములో ఉండటంతో ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. కార్యాలయం నిఘా నీడలో ఉండే విధంగా సీసీ కెమెరాలను అమర్చారు.

ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డులివ్వాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12: ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలోని బీజేపీ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చాలా మంది ఒంటరి మహిళలు ఉన్నారన్నారు. గత ఐదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైన ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12: మండలంలోని నెలగొండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జనసైనికుడు అంజికి సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కురుబ పురుషోత్తం ఆర్థిక సాయం అందజేశారు. అంజిని పరామర్శించి రూ. 5వేలను అందించారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

మున్సిపల్ కార్మికుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, ఆగస్టు 12 : పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు వెంకటేశులు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యలతో కుటుంబసభ్యులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ రఘు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టును సంప్రదించి సాయం చేయాలని కోరారు. స్పందించిన ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ రూ. 20 వేల చెక్కును సోమవారం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ ఛైర్మన్ సురేష్, కార్యదర్శి హరి, సభ్యులు పాల్గొన్నారు.



కార్మికుడికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య తలెత్తకూడదు

● ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి ఆదేశం

తాడిపత్రి, ఆగస్టు12: నియోజకవర్గంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకూడదని, అందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఎమ్మెల్యే జేసీ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చూడాలన్నారు. వాటికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ వద్ద అదనంగా బోర్లు వేయడం వల్ల యాడికి మండలానికి తాగునీరు ఇవ్వడానికి వీలవుతుందని ఎమ్మెల్యే దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు. రిజర్వాయర్, పెండేకల్లు పంప్‌హౌస్, పెద్దపప్పూరు పంప్ హౌస్ వద్ద కొన్ని మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. పెండేకల్లు నుంచి యాడికికి పైప్‌లైన్ వేస్తే తాగునీటి సమస్య ఉండదని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లడుతూ యాడికి మండలంలోని కేశవరాయునిపేట, దైవాలమడుగు, లక్షుంపల్లి గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారానికి రాయలచెరువు నుంచి చందన వరకు పైప్‌లైన్ వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట, నామనాంకపల్లి, వరదాయపల్లి గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు నామనాంకపల్లి వద్ద సంపును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈ శ్రీరాములు, జేఈలు దేవకుమార్, మహేష్‌బాబు, ప్రసాద్‌రెడ్డి, సూర్యనారాయణలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పూడికతీత పనుల పరిశీలన

తాడిపత్రి పట్టణంలో చేపట్టిన డ్రైనేజీల పూడికతీత పనులు సోమవారం కూడా కొనసాగాయి. సీపీఐ కాలనీ, నంద్యాలరోడ్డులో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడ తదితరులు ఉన్నారు.

జీవో 117ను వెంటనే రద్దుచేయాలి

● ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ ● ఎంఈఓలకు వినతిపత్రాల అందజేత

యాడికి, ఆగస్టు12: జీవో 117ను వెంటనే రద్దుచేయాలని పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం ఎంఈఓ కాశప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థ పతనానికి గొడ్డలిపెట్టుగా మారిన 117జీఓ ప్రకారం చేపడుతున్న ఉపాధ్యాయ పని సర్దుబాటు ప్రక్రియను బాయ్‌కాట్ చేస్తున్నట్లు తెలిపారు. అసంబద్ధమైన జీవో 117ను వెంటనే రద్దుచేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవీంద్ర, శ్రీనివాసయాదవ్, జయప్రసాదరావు, నబీరసూల్ తదితరులు ఉన్నారు.

ఉరవకొండ: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పని సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలన్నారు. జీవో 117 ద్వారా కాకుండా, 2020లో విడుదల చేసిన జీవో 53ప్రక్రియ ప్రకారం సర్దుబాటు చేయాలన్నారు. ఫ్యాప్టో నాయకులు హనుమప్ప, భాస్కర్, పాండురంగ, ఓబన్న, వేణు, బండయ్య, ఇస్లాంబాషా పాల్గొన్నారు.

యల్లనూరు: జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని కోరుతూ మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఎంఈఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక మండల అధ్యక్షుడు సూర్యనారాయణ , కార్యదర్శి హుస్సేన్ తదితరులు ఉన్నారు.

పామిడి: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను జీవో 53 ప్రకారం చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకటరమణ, రామాంజనేయులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: 117 జీవో వెంటనే రద్దు చేయాలని, 53 జీవోని అమలులోకి తేవాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మండలకేంద్రంలో ఎంఈఓ తిప్పేస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, మండలఅధ్యక్షుడు మంజూనాథ, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ బీసీ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌టీయూ నాయకులు మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవో నెంబర్ 117 ప్రకారం కాకుండా, జీవో నెంబర్ 53 ప్రకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు వై రాజు, ప్రధాన కార్యదర్శి రేవన్న, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభం

బొమ్మనహాళ్/ యాడికి/గుత్తిరూరల్/ పెద్దవడుగూరు/ రాయదుర్గం రూరల్, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు సోమవారం ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలని ఈఓపీఆర్డీ సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు, చెత్తతో సంపద తయారీ, వీధిలైట్ల నిర్వహణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. 2024-25 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారీ గురించి తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి నిధుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రధాన సమస్యలు గుర్తించి ఆయా శాఖల అధికారులకు తెలియజేయాలని సూచించారు.. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. అలాగే యాడికి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేష్, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఏఓ నాగేశ్వర్‌రెడ్డి, పలు గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. గుత్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోనూ ఎంపీడీఓ శివాజీ రెడ్డి మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. పెద్దవడుగూరు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని గ్రామాల సర్పంచులకు శిక్షణ తరగతు లు జరిగాయి. ఇక రాయదుర్గం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఎంపీడీఓ అల్లాబకాష్, ఈఓఆర్డీ రంగనాయకులు తెలిపారు.

భార్యల స్థానంలో భర్తలు, కుటుంబసభ్యులు హాజరు

ఉరవకొండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి మహిళా సర్పంచ్‌ల స్థానంలో వారి భర్తలు హాజరయ్యారు. ఎంపీడీవో సుబ్బరాజు ఆధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. ఇందుకు లత్తవరం తండా సర్పంచ్ స్థానంలో ఆమె భర్త హాజరయ్యారు. రాయంపల్లి సర్పంచ్‌కు బదులుగా ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

బెళుగుప్ప, ఆగస్టు 12: మండలంలో ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన వీఆర్వోల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 9 గంటలకు గ్రామాల్లో హాజరుకావాలన్నారు. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు తీసుకుని రసీదు ఇవ్వాలని, సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నగేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

యాడికి: ఈనెల 16నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 16న గుడిపాడు, 20న నగరూరు, 22న ఓబులాపురం, 24న నిట్టూరు, 27న తిమ్మాపురం, 29న చందన, 31న కుందనకోట, సెప్టెంబరు 3న రాయలచెరువు, 5న యాడికి, 10న కోనుప్పలపాడు, 13న పుప్పాల, 17న వేములపాడు, 20న తూట్రాళ్లపల్లి, 24న కమలపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విడపనకల్లు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వివిధ శాఖల అధికారులుతో తహసీల్దార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 16 నుంచి సెప్టెంబరు నెల 30వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని, ప్రతి అధికారి తప్పక హాజరవ్వాలని సూచించారు. 16న డొనేకల్లు, కడదరబెంచి, 17న గడేకల్లు, 19న ఎన్ తిమ్మాపురం, అంచనహాలు, 20న పాలికి, వేల్పుమడుగు, 21న ఉండబండ, చీకలగురికి, 22న కరకముక్కల, 23న హావళిగి, 24న పాల్తూరు, 27న మాళాపురం, 28న విడపనకల్లు గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 12: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పట్టణంలో సోమవారం బీజే వైఎం, బీజేపీ నాయకులు సుమారు 1500 మంది విద్యార్థులో కలిసి భారీఎత్తున హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజు హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతిఒక్కరూ జాతీయ పతాకాన్ని ఇంటిపై ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, వై నరసింహమూర్తి యాదవ్, పాలబండ్ల ఆంజనేయులు, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఇన్‌ఫ్లో 66 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 12: జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం 66 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.267 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు, ఆగస్టు 12: దళిత ఉద్యోగిని సమస్యపై సానుభూతి చూపకుండా, ఆమె ఆత్మహత్యకు కారకుడైన రైల్వే సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) సుదర్శన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కదిరిలో జేఈగా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న ఎం నాగమణి విషయంగా ఉన్నతాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఈ సంఘ నాయకులు సోమవారం ఉదయం పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జోనల్ నాయకులు మాట్లాడుతూ గతంలో గుంతకల్లులో నివాసమున్న రైల్వే ఉద్యోగిని ఎం నాగమణిపై ఆమె మెట్టినింటివారి నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం కదిరిలో పనిచేస్తున్న ఈమెను గుంతకల్లుకు బదిలీచేశారన్నారు. గుంతకల్లులో పనిచేస్తే మరలా అత్తవారింటి నుంచి సమస్యలు ఎదురౌతాయని, తనకు మరెక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ బతిమాలుకున్నా సీనియర్ డీఈఈ సుదర్శన్ రెడ్డి కనికరించలేదన్నారు. గత్యంతరం లేని నాగమణి పది రోజుల కిందట ఆత్మహత్య చేసుకుందన్నారు. దళిత ఉద్యోగిని పట్ల కొంచెమైనా కనికరం లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన డీఈఈపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రిమినల్ కంప్లయింట్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు ఎప్రామ్, వర్కింగ్ ప్రెసిడెంటు రాజశేఖర్, కార్యదర్శి పాపారావ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీఈవోపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ, ఆగస్టు 12: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీఈవో సిద్దేశ్వరిపై చర్యలు తీసుకోవాలని వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏవో మధుకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎంపీఈఓ ఈ క్రాప్ నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆమె వైఖరి వల్ల ఇన్‌పుట్‌సబ్సిడీ కూడా రాలేదని వాపోయారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థులతో పాటు టీడీపీ నాయకులు రజాక్‌వలీ, రామచంద్ర నాయక్, బాలేనాయక్ పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 12: డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం ప్రాంతం వద్ద ఇనుపఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓబుళాపురం ప్రాంతంలో మైనింగ్‌కు సంబంధించిన ఇనుప ముడి ఖనిజాన్ని రెండు రోజుల క్రితం వేల టన్నులను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ముడిసరుకును సేకరించే బళ్లారి ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీలకు తరలించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ముడిసరుకు రవాణా చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఓబుళాపురం, హెచ్ఎస్ తండాకు చెందిన కొందరు వ్యక్తులు ముడి ఖనిజాన్ని అక్రమంగా తరలించినట్లు తెలిపారు.

గ్యాంగ్‌మన్ ఆత్మహత్య

గుంతకల్లు, ఆగస్టు 12: పట్టణంలో రైల్వే గ్యాంగ్‌మన్‌గా పనిచేస్తున్న శివలింగ (55) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్యాంగ్ మెటీరియల్‌ను తీసుకురావడానికి రైల్వే లారీలో వెళ్తుండగా ఓ గ్యాంగ్‌మన్ డ్రైవరు సీటు పక్కన, శివలింగ వెనుక కూర్చున్నారు. లారీ మంత్రాలయం వద్ద వెళ్తుండగా శివలింగ వాహనంలోనే ఉరి వేసుకున్నాడు వెనుక నుంచి వచ్చిన వాహనదారులు ఉరికి వేలాడుతున్న శివలింగను చూసి లారీ డ్రైవరుకు తెలిపారు. లారీని ఆపి, శివలింగను కిందకు దింపి గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి తీసుకువచ్చారు. కానీ అప్పటికే అతడు మరణించినట్లు రైల్వే ఆసుపత్రి వైద్యు లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 12: పట్టణంలో సోమవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై వైద్యఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ యంత్రణ సంస్థ, ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది. వ్యాపించకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చరణ్, ప్రిన్సిపాల్ మల్లికార్జున, క్షయవ్యాధి నిపుణులు సత్యనారాయణ, ఆర్‌డీఎస్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఐసీటీసీ కౌన్సిలర్ ఈశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్ : పట్టణంలో ప్రగతి మైత్రి మహిళా సంఘం వారు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఐసీటీసీ, డీఎస్ఆర్సీ, పీపీటీసీ కౌన్సిలర్లు ప్రసాద్, పీరనాయక్, సుమలత, సంఘం డైరెక్టర్ నూర్జహాన్, ఎంఈ రాధమ్మ పాల్గొన్నారు.

మినీ గోకులాలకు 115 దరఖాస్తులు

యాడికి, ఆగస్టు 12: మినీ గోకులాల ఏర్పాటుకు మండలవ్యాప్తంగా 115దరఖాస్తులు వచ్చినట్లు వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. దరఖాస్తులన్నింటిని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్: ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 12: నియోజకవర్గంలో ఉండే డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని, దీంతో రాయదుర్గం ప్రాంతానికి చెందిన కనీసం 150 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో ఈ కోచింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. 500 మంది దాకా డీఎస్సీ, టెట్ అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వాలని భావించామన్నారు. కోచింగ్ ఇవ్వడానికి విజయవాడ, హైదరాబాద్, అవనిగడ్డ, నెల్లూరు ప్రాంతాల నుంచి నిపుణులను పిలిపిస్తున్నామన్నారు. డేగోళంలోని టెక్స్‌టైల్స్ పార్క్‌లో ప్రశాంతమైన వాతావరణంలో అన్ని సౌకర్యాల నడుమ కోచింగ్ సెంటర్ ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల దాకా కోచింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు పట్టణంలోని అభ్యర్థులను మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను 18వ తేదీలోపు తన క్యాంపు కార్యాలయంలో అందించాలన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ డీఎస్సీ, టెట్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



దరఖాస్తు ఫారాన్ని చూపుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

జలవనరుల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఆగస్టు 12: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో కలిశారు. తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించేందుకు మంత్రి రావడంతో ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రితో కలిసి ఎమ్మెల్యే సురేంద్రబాబు మంగళవారం డ్యామ్‌ను పరిశీలించనున్నారు.



బెంగళూరు విమానాశ్రయంలో మంత్రితో ఎమ్మెల్యే అమిలినేని

కేంద్ర మంత్రిని కలిసిన మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 12: కర్ణాటకలోని హుబ్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషిని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ డైరెక్టర్ వీ విజయలక్ష్మి, వీ కిరణ్ దంపతులు సోమవారం కలిశారు. రాష్ట్రంలో పలు ఎఫ్‌సీఐ గోదాములు, రేషన్ షాపులు, మధ్యాహ్న భోజనం పథకంలో జరుగుతున్న అవకతవకల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కమిటీకి ఛైర్మన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

గార్లదిన్నె, ఆగస్టు 12 : మండలంలోని పాతకల్లూరు గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత కల్లూరుకు చెందిన మల్లికార్జునకు పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన ఓబిలేసు, లక్ష్మిదేవి దంపతుల కుమార్తె లలిత (20)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. మల్లికార్జున, లలిత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. అయితే కొంత కాలంగా మల్లికార్జున లలితను అనుమానిస్తుండడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. కాగా సోమవారం ఉదయం ఇంటి తలుపులు ఎంతసేపటికీ తీయకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు, చుట్టుపక్కల వారు వెళ్లి తలుపులు తీశారు. లలిత ఉరికి వేళాడుతూ కనిపించడంతో వెంటనే వారు ఆమెను పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమార్తె మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని , అల్లుడే చంపి ఉంటాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లలితది ఆత్మహత్యానా...? హత్యనా...? అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

ఉరవకొండ, ఆగస్టు 12: ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఓ గుర్తింపు కోసం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఐఎస్ఓ ప్రతినిధుల బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. జిల్లాలో గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం ఐఎస్ఓ గుర్తింపు పొంది మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా ఇటీవల ఆర్డీఓ సర్టిఫికెట్‌ను ఆర్డీవో తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఐఎస్ఓ ప్రతినిధుల బృందం సభ్యులు సింగన్న, ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్‌బాషా, డీటీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ర్యాలీ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం ఆ ఫెడరేషన్ నాయకులు స్థానిక విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బీరప్ప సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ విద్యారంగసమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనపథకాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మాజీ నాయకులు నాగేషు, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయిస్వరూప, జిల్లా నాయకులు రాధా, జ్యోతి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో చందు, హరున్ రషీద్, కరుణాకర్, సురేష్, ఆకాష్ పాల్గొన్నారు.

8వ పీఆర్సీని వేయాలని నిరసన

గుత్తి, ఆగస్టు 12: 8వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్‌లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సోమవారం టీ విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో నిలిపివేసిన 18నెలల డీఏను వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుకులకు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు మెడికల్ అలవెన్స్ పెంచాలని, స్థానిక రైల్వే ఆస్పత్రిలో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రెటరీ రామాంజనేయులు రెడ్డి, ఛైర్మన్ నరసింహ, నాయకులు దాదాఖలందర్, కృష్ణనాయక్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కబ్జాపై ఫిర్యాదు

బెళుగుప్ప, ఆగస్టు 12 : మండలంలోని ఎర్రగుడిలో ఓ వైసీపీ నాయకుడు పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలు 7 సెంట్లను కబ్జా చేశాడని, విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు దబ్బర లక్ష్మీనారాయణ, ప్రభాకర్, చిరంజీవి కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరాకు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

బెళుగుప్ప/ బొమ్మనహాళ్ ఆగస్టు 12: బెళుగుప్ప మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీడీఓగా జీఎస్ రామచంద్ర బాధ్యతలు చేపట్టారు. అలాగే బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా షకీలా బేగం బాధ్యతలు చేపట్టారు. వారికి కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

కేజీబీవీ తనిఖీ

డీ.హీరేహాళ్, ఆగస్టు 12: మండల కేంద్రంలో ని కేజీబీవీని సోమవారం సాయంత్రం రాయదుర్గం సివిల్ న్యాయాధికారి రమ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో హాజరుపట్టికను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వాటిని నిర్మూలించడానికి కృషి చేయాలని తెలిపారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి రమ్య